


# వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు

మిచౌంగ్ తుపాన్ ప్రభావం

హైదరాబాద్‌లో అక్కడక్కడా చిరుజల్లులు

2లో..


వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 144 మంగళవారం | 05 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




# స్పీకర్ రేసులో రేవూరి..?

వివాదరహితుడిగా గుర్తింపు

కలిసొచ్చిన మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం

మంత్రి వర్గంలో మరో ఇద్దరూ

కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసినట్లు సమాచారం

రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరనున్న కాంగ్రెస్ సర్కార్ లో అతి కీలకమైన స్పీకర్ పదవికి పరకాల ఎమ్మెల్యే, సీనియర్ పొలిటీషియన్ రేవూరి ప్రకాశ్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వివాద రహితుడు, సున్నిత మనస్కుడైన ఆయనను అధిష్ఠానం ఈ మేరకు ఖరారు చేసినట్లు సమాచారం. సభను హుందాగా నడిపించడంలో ఆయన అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 'రేవూరి' మూడుసార్లు నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడంతోపాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి నాలుగోసారి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాజకీయాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవంతోపాటు అందరితో కలివిడిగా ఉండే ప్రకాశ్ రెడ్డిని స్పీకర్ గా నియమిస్తే ఆ పదవికే గుర్తింపు తెస్తారని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ఆ పార్టీలోని అన్ని వర్గాలవారు రేవూరి ప్రకాశ్ రెడ్డి పేరునే సూచించినట్లు తెలుస్తోంది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



వివరాలు 2లో..



8లో

# సీఎంగా రేవంత్ రెడ్డి

సీఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక

7న ప్రమాణ స్వీకారం

ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు వేణుగోపాల్



8లో

# పాగాల సంపత్‌కు కేటీఆర్ నివాళి

ఆయన మరణం పార్టీకి తీరని లోటని వ్యాఖ్య

కుటుంబ సభ్యులకు అండగా ఉంటామంటూ హామీ



8లో

# ఘనంగా సామూహిక అనగాష్టమి వ్రతాలు

దత్త పీఠంలో ఏర్పాట్లు

# స్పీకర్ రేసులో రేవూరి..?



**వివాదరహితుడిగా గుర్తింపు**

**కలిసొచ్చిన మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం**

**మంత్రి వర్గంలో మరో ఇద్దరూ**

**కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసినట్లు సమాచారం**



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వివాద రహితుడు, మృదుస్వభావి, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలంగాణ శాసన సభ మూడో స్పీకర్ గా కొలువుదీరనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న రేవూరి ప్రకాశ్ రెడ్డికి అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులతోపాటు ప్రజలతో మంచి అనుబంధం ఉంది. తెలుగు దేశం పార్టీలో రాజకీయ ఓనమాలు దిద్దిన రేవూరి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994, 1999, 2004లో వరుసగా మూడు పర్యాయాలు నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన పరకాల నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం కలిగిన ఆయన అసెంబ్లీని హుందాగా నడుపుతారన్న అభిప్రాయాన్ని అధిష్ఠానం వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీలోని అన్ని వర్గాలతోపాటు ఢిల్లీలోని ప్రముఖులు సైతం రేవూరి ప్రకాశ్ రెడ్డి పేరునే సూచించడంతో అధిష్ఠానం కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

## పదవులకే వన్నె తెచ్చిన రేవూరి..

తెలుగుదేశం పార్టీలో రేవూరి ప్రకాశ్ రెడ్డి ఎన్నో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయన ఏ పదవిలో ఉన్నప్పటికీ ఆ పదవికే వన్నె తెచ్చేవారన్న ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఆయన సేవలు మరువలేనివి. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ గా, 610 జీఓ అమలు కమిటీ చైర్మన్ గా కూడా ఆయన నిర్వహించిన పాత్రను నేటి రాజకీయ నాయకులు సైతం కొనియాడుతున్నారు.

## కాంగ్రెస్ ప్రస్థానం..

రేవూరి ప్రకాష్ రెడ్డి తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి నర్సంపేట నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆయన పొత్తుల్లో భాగంగా 2018లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 4 సెప్టెంబర్ 2019లో టీడీపీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది కాంగ్రెస్ పార్టీ అని భావించిన రేవూరి బీజేపీకీ రాజీనామా చేశారు. అయితే రేవంత్ రడ్డికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన రేవూరి కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్రలో భాగంగా 2023 అక్టోబర్ లో భూపాలపల్లికి వచ్చిన రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీ ఆహ్వానించారు.

## కలిసొచ్చిన ఎన్నికలు..

రేవూరి ప్రకాశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన నెల రోజులకే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చింది. ఆయన స్వతహాగా నర్సంపేట వాస్తవ్యుడైనప్పటికీ అప్పటికే మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పేరును నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఖరారు చేయడంతో పక్కనే ఉన్న పరకాలవైపు రేవూరి దృష్టి మరలింది. కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న ఇనగాల వెంకట్రాంరెడ్డిని కాదని కాంగ్రెస్ అధిష్ఠానం రేవూరి ప్రకాశ్ రెడ్డికి టికెట్ కేటాయించింది. ప్రజలతో మంచి సంబంధాలు కలిగిన రేవూరి తనదైన శైలిలో ప్రచారం చేయడంతోపాటు కాలం కలిసి రావడంతో అక్కడినుంచి భారీ మెజార్టీతో విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన రెండు నెలలకే ఆయన ఆ పార్టీ ఎమ్మెల్యేగా విజయం సాధించడం కొసమెరుపు.





## మంత్రి వర్గంలో మరో ఇద్దరూ..

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం 12 నియోజకవర్గాలుండగా అందులో 10 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. జనగామ, స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గాల్లో బీఆర్ ఎస్ అభ్యర్థులు గెలిచారు. కాంగ్రెస్ పార్టీని మరుపురాని విజయాన్ని అందించిన ఈ ప్రాంతంనుంచి కనీసం ఇద్దరు లేదు ముగ్గురికి మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. అయితే రేవూరి ప్రకాశ్ రెడ్డిని స్పీకర్ గా నియమించడంతో మరో ఇద్దరికి మంత్రి వర్గంలో చోటు ఇవ్వనున్నట్లు తెలిసింది. అయితే వీరిలో ప్రముఖంగా ములుగు ఎమ్మెల్యేగా వరుసగా మూడో సారి విజయం సాధించిన ధనసరి అనసూర్య అలియాస్ సీతక్క పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆమెతో పాటు గతంలో మంత్రిగా పనిచేసిన వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకు కూడా కేబినెట్ లో అవకాశం కల్పించనున్నారు.

# వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు

**మిచౌంగ్ తుపాన్ ప్రభావం**

**హైదరాబాద్‌లో అక్కడక్కడా చిరుజల్లులు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మిచౌంగ్ తుపాను కోస్తాంధ్ర తీరం దాటిన నేపథ్యంలో రాష్ట్రంలోని ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు మెరుపులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుందని వెల్లడించింది. ఈనేపథ్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. భద్రాచాలం, అశ్వారావుపేట, నేలకొండపల్లి, ఇల్లందు, అన్నపురెడ్డి పల్లి, కల్లూరు, ఆళ్లపల్లి, సత్తుపల్లి, దమ్మపేట, కూసుమంచి, కారేపల్లి మండలాలతోపాటు పాల్వంచ, తిరుమలాయపాలెంలో జోరుగా వర్షం కురుస్తోంది. దీంతో మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, మేడ్చల్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, హైదరాబాద్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ప్రజలకు సూచించింది. ఎత్తయిన ప్రదేశాలు, చెట్ల కింద ఉండొద్దని హెచ్చరించింది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి, ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా కలెక్టర్లతో సవిరీక్ష నిర్వహించారు. నేడు, రేపు భారీ వర్షం కురుస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రాద్రి, ములుగు జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పంపిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే నిండిన చెరువులకు గండ్లు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల వద్ద జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



# ఎన్నికల్లో సిబ్బంది పనితీరు భేష్

**అభినందించిన వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ వాయిస్, క్రైం :** సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకంగా నిలిచిన పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసన ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో శ్రమించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి మంగళవారం ఆయన ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి సంఘటనలు జరగకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది శ్రమించిన తీరు స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ ఎన్నికల్లో పోలీసులు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పనిచేయడం ద్వారా ఎన్నికల నిర్వహణ మరింత సులభమయిందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ టాస్క్ ఫోర్స్, సీసీఆర్ బీ ఏసీపీలు జితేందర్ రెడ్డి, మధుసూదన్, కృష్ణతో పాటు ఇన్స్ స్పెక్టర్లు, సబ్ ఇన్స్ స్పెక్టర్లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ

## డాక్టర్ అనితా రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాలను సంబరాలను ది నేషనల్ కన్జుమర్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పిల్లలు పాటలు పాడి, డాన్స్ లు చేసి అలరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల వారోత్సవాలు అంటే ముందుగా వారిని గౌరవించాలని, వారి ఎదుగుదలకు చేయూతనివ్వాలని, వారి హక్కులను కాపాడాలని, అప్పుడే అది నిజమైన దివ్యాంగుల సంబరాలవుతాయని డాక్టర్ అనితా రెడ్డి తెలిపారు. మానసిక దివ్యాంగులకు అందరిలాగే వారసత్వపు హక్కు ఉంటుందని కానీ, వారు ఏమి చేసుకుంటారని తల్లిదండ్రులు వారికి మిగతా పిల్లలకు ఇచ్చినట్లు ఇవ్వడం లేదని, అది చాలా తప్పు అని తల్లిదండ్రుల తరువాత వీరు బతకడానికి ఆ ఆస్తి ఎంతో భద్రత ఇస్తుందని, ఆస్తి ఉంటే వీరిని చూసుకోవడానికి ముందుకు వస్తారని దీనిపై అవగాహన అవసరం అన్నారు. మానసిక దివ్యాంగ కొంతైనా నిర్మూలన కావాలంటే మేనరికం, దగ్గర సంబంధాలతో పెళ్లి చేయకూడదని, అలాగే గర్భంతో ఉన్న సమయంలో మహిళ అధిక వత్తిడికి గురికాకూడదని అన్నారు, దివ్యాంగుల ఉద్యోగాలలో మూడు శాతం రిజర్వేషన్ తప్పక అమలైయేలా ప్రభుత్వం చూడాలని, దివ్యాంగుల వారోత్సవాల సందర్భంగా దివ్యాంగుల హక్కుల గురించి గ్రామ స్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అదే నిజమైన దివ్యాంగుల వారోత్సవాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డితో పాటు, స్పందన నిర్వహకురాలు సుచరిత, హరిత, కళ్యాణ్, పిల్లలు పాల్గొన్నారు.

# ప్రగతి భవన్ ఇక నుంచి అంబేద్కర్ ప్రజా భవన్

## ప్రొఫెసర్ గుగులోతు వీరన్న నాయక్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ప్రగతి భవన్ ఇక నుంచి అంబేద్కర్ ప్రజా భవన్ గా పేరు మార్చడం పట్ల కాంగ్రెస్ పార్టీ తెలంగాణ గిరిజనుల మేధావుల ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ గుగులోత్ వీరన్న నాయక్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా బీఆర్ఎస్ పార్టీ అవలంబిస్తున్న నిరంకుశ విధానాలకు స్వస్తి పలికిన తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు వచ్చిన కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్ష కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సాకారం కానున్నదని ఆయన అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొజ్జపురి అశోక్ ముఖర్జీ, మహిళా మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు, కొదురుపాక సాదన్, ఆదరి రవీందర్, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, అల్లెపు శ్రీను, కుమారస్వామి పాల్గొన్నారు.

# చెన్నూరి రతన్ కుమార్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** ఉస్మానియా యూనివర్సిటి నుంచి పీహెచ్ డీ పట్టా పొందిన ప్రైవేట్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చెన్నూరి రతన్ కుమార్ కేశవ్ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలోని అధ్యాపకుడు హనుమకొండ జిల్లా భీమారం గ్రామానికి చెందిన చెన్నూరి రతన్ కుమార్ కు పీహెచ్‌డీ లభించింది. "ఇంప్రూవ్మెంట్ ఆఫ్ రికమండేడ్ సిస్టం పెర్ఫార్మెన్స్ బై స్పామింగ్ డిటెక్షన్ ఇన్ ఆన్లైన్ ఒపీనియన్స్ యూజింగ్ మిషన్ లెర్నింగ్" అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో సీబీఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ కె.రాధిక మార్గదర్శకత్వంలో ఈ పరిశోధన జరిగింది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, పీహెచ్ డీ గైడ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల సహకారంతో విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు.

# శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్న సీఈవో విజయలక్ష్మి



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని కొడవటంచ సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో విజయలక్ష్మి పలువురి అధికారులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి సీఈవో విజయలక్ష్మి అధికారులతో కలిసి రావడంతో ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్, పూజారులు స్వాగతం పలికారు. అనంతరం సీఈవో విజయలక్ష్మి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా పూజారులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సీఈవో విజయలక్ష్మి రేగొండ మండల పరిషత్ కార్యాలయం సందర్శించి ఉపాధి హామీ పనులు, నర్సరీ, బ్యాగు పిల్లింగ్ లు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఈవో కొడవటంచ నర్సరీ సైట్ పరిశీలించి మొక్కలకు ఎప్పటికప్పుడు నీటితో తడుపుతూ ఉండాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల పరిషత్ అధికారి గొడిసెల సురేందర్ గౌడ్, మహాముత్తారం, మలహర్రావు, కాటారం, చిట్యాల, గణపురం, మొగుళ్లపల్లి మండలాల ఎంపీడీవోలు ఆంజనేయులు, నరసింహమూర్తి, శంకర్, రామయ్య, అరుంధతి, కృష్ణవేణి, కొడవటంచ గ్రామ సర్పంచ్ పబ్బ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి అమూల్య, పలు గ్రామాల కార్యదర్శులు, అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# పొన్నంకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** తెలంగాణ ఉద్యమ నాయకుడు పొన్నం ప్రభాకర్ ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్పాల ప్రకాష్ డిమాండ్ చేశారు. విద్యార్థి దశ నుంచి పొన్నం ప్రభాకర్ అంచెలంచలుగా ఎదిగి మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2005 నుంచి 2009 వరకు మార్కెట్ చైర్మన్ గా, 2009 నుంచి 2014 వరకు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టే సమయంలో పేపర్ స్ప్రేకు గురయ్యారు. నాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న కేసీఆర్ ను తిరస్కరించి తెలంగాణ రాష్ట్ర ప్రజలు, బహుజన నాయకులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు మేధావులు, రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ యావత్ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అంబేద్కర్ సంఘం పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూముల సదానందం, తాళ్లపల్లి ఐలయ్య, చుంచు రమేష్, పొందూరు ఎల్లయ్య, ఆకునూరి వెంకటరాజం, జాలరవి, బొల్లంపల్లి ప్రసాద్, పాషా పాల్గొన్నారు.

# సంపత్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు



**వరంగల్ వాయిస్, జనగామ :** బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. అనంతరం సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన పాగాల సంపత్‌రెడ్డి హఠాన్మరణం బాధాకరం అన్నారు. 14ఏళ్లు కేసీఆర్ వెంట సైనికుడిలా ఉండి పని చేశారని, సంపత్‌రెడ్డి మరణం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తను కలచి వేసిందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి క్రియాశీలకంగా పని చేశారని, పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తూ విజయవంతం చేశారన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్, పార్టీ శ్రేణుల తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంపత్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటన్న కేటీఆర్, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జడ్పీ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు పార్టీ కార్యాలయాల్లో ఘనంగా నివాళులు అర్పించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# ధర్మశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ధర్మ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పాలకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని రెడ్డి విజయం సాధించడంపై మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. యువకులు డాక్టర్ బానోతు చిరంజీవి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ మెంబర్ ఆదేశాల మేరకు ఈ సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ ధరావత్ విమల పార్టీ సభ్యులు ధరావత్ సోమన్న మాట్లాడుతూ యశస్విని రెడ్డి ఎమ్మెల్యే చాలా చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపొందడం చాలా సంతోషకరమన్నారు. అలాగే ప్రజలు తమల్ని నమ్ముకుని గెలిపించిన వారి కోసం కష్టపడి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచాలని కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆరు హామీలను ప్రజలకు ఇచ్చారు. ఆ హామీలను తప్పకుండా నెరవేయడం వెలసిన బాధ్యత తమరిపై పార్టీ ఉందన్నారు. ముఖ్యంగా యువకులను, వృద్ధులను, ఉద్యోగస్తులను, నాయకులను ఇతరుల అందర్నీ కూడా దృష్టిలో పెట్టుకొని సేవా కార్యక్రమాలు చేయవలసిన బాధ్యత ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ధరావత్ లోకేష్ అధ్యక్షుడు విశ్వనాధ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సభ్యులు ధరావత్ దేవేందర్ నాయక్, బిచ్చ నాయక్, వాసు నాయక్, దేవేందర్ నాయక్, శ్రీను నాయక్, భీమా నాయక్, ధరావత్ జమున, ధరావత్ లక్ష్మి, పోనా నాయక్, మంగళపల్లి యాకయ్య, సుజాత, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కుంకుమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో సుప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవ పూర్వక వజ్రగధిత పాశుపత మహా రుద్ర యాగ సహిత ఆకాశ దీపోత్సవ మహా అన్నదాన మహెూత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం పరకాలకు చెందిన మారేపల్లి రాహుల్య పృధ్వీరాజ్ దంపతుల చేతుల మీదుగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో శైవాగమ పండితులు శ్రీ కోమాళ్లపల్లి సంపత్ కుమార్ శర్మ ఆచార్యత్వమున స్వామి వారి పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు మహానదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సాయంత్రం వేళ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అల్పాహారాన్ని కట్కూరి దివ్య రాజ్ కుమార్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కార్తీక మాసం ప్రారంభం నుంచి నేటి వరకు శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో నిత్యం మహా అన్నదాన కార్యక్రమాలను దాతల సహాయ సహకారాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అల్పాహారాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తో పాటు ధర్మకర్తల మండలి ఆలయ వంశానుగత అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణ శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటయ్య, భక్తులు పలువురు పాల్గొన్నారు.



## 8న మెట్టుగుట్టపై సామూహిక సత్యనారాయణ వ్రతం



**వరంగల్ వాయిస్, మడికొండ :** ఓరుగల్లు మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దేవస్థానములలో మంగళవారం శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారికి కాజీపేట వాస్తవ్యులు శర్విరాల సోమేశ్వర్ స్వరూపరాణి దంపతులు, సుమారు 28,000/- విలువ గల వెండి శరగోపం, ప్లేటు సమర్పణ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించి, భక్తులచే అభిషేకాలు జరిపించారు. అనంతరం రామాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. సాయంకాలం సూర్యాస్తమయం అనంతరం స్వామి వార్లకి ఆకాశ దీపోత్సవం నిర్వహించి, ప్రదోషకాల రుద్రాభిషేకం చేసి, విశేషంగా అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 8న శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించబడునని, కాబట్టి ఈ పూజలో పాల్గొనదలచిన భక్తులు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషు భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణు వర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన కానిస్టేబుల్ యాదయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సుబేదారి పోలీస్ స్టేషన్ లో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న అవసరం ఉన్న వ్యక్తికి మంగళవారం నాగపురి యాదయ్య రక్తదానం చేశారు. జనగాం జిల్లా తరిగొప్పుల మండలం అంకుషాపూర్ గ్రామానికి చెందిన నాగపురి యాదయ్య రిలీఫ్ హాస్పిటల్ హనుమకొండలో చికిత్స పొందుతున్న పి.వీరలక్ష్మికి అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా బ్లడ్ డోనర్ , బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) ద్వారా సమాచారం తెలుసుకొని వెంటనే స్పందించారు. రిలీఫ్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ హనుమకొండ లో 9వ సారి ఏబీ పాజిటివ్ రక్తదానం చేయడం జరిగింది. రక్తదానం చేసిన నాగపురి యాదయ్యను తోటి మిత్రులు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కొత్తకొండ అరుణ్ కుమార్, బొట్టు కమలాకర్, పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

## పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్ కు మంత్రి పదవీ ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పచ్చునూరి కరుణాకర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైన విద్యార్థి దశ నుంచి ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగి ఆంధ్రప్రదేశ్ లో కరీంనగర్ జిల్లాకు ఎంపీగా, ఫోరం అధ్యక్షుడిగా పార్లమెంటులో తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేసిన పార్లమెంట్ టైగర్ గా పిలవబడిన పొన్నం ప్రభాకర్ కు మంత్రి పదవి ఇవ్వాలని భీమదేవరపల్లి మండల ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి సదానందం గౌడ్, మార్పాటి శ్రీనివాస్ రెడ్డి, డబ్బా శంకర్, మాచర్ల సదానందం గౌడు, చాగంటి వెంకటేశ్వర్లు, ఎలుక పెల్లి శ్రీనివాస్, దండపెల్లి కమలాకర్, జయకృష్ణ, చిట్టపల్లి చిరంజీవి, సదానందం, రాకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ధాన్య రాశులపై పరదాలు



మొంచింగ్ తుఫాన్ ఎఫెక్ట్ తో మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి చిరు జల్లులు కురవడం తో కొయ్యూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులపై పరదాలు కప్పిన దృశ్యం.

వరంగల్ వాయిస్, మల్హర్

## తుఫానుపై అప్రమత్తత అవసరం

### ములుగు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం



**వరంగల్ వాయిస్, ములుగు :** వాతావరణ శాఖ ద్వారా మొంచింగ్ తుఫాను హెచ్చరికలు జారీ అయినందున భారీ వర్ష పాతంతో పాటు ఈదురు గాలులు సంభవించే అవకాశం ఉన్నందున ములుగు జిల్లా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ములుగు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం సూచించారు. కరెంటు వైర్లు చెట్లు విరిగి పడే ప్రమాదం ఉన్నందున అవసరం అయితే తప్ప ఇంటి నుండి బయటికి రావద్దన్నారు. వరద ముందస్తు చర్యల్లో భాగంగా ములుగు ఏటూరు నాగారం సబ్ డివిజన్ పరిధి లో ఒక్కోటి డీడీఆర్ఎఫ్ (డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్-జిల్లా విపత్తు రక్షణ బృందం) టీమ్‌ను ఉంచడం జరుగుతుందని తెలిపారు. వీరితో పాటు పోలీస్ స్టేషన్ అధికారులు సైతం తాడు, ట్యూబ్‌లు, విజిల్స్, టార్చ్ లైట్లు, పెట్రోల్ వుడ్ కట్టర్స్ మొదలైన ప్రాథమిక వస్తువులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. స్టేషన్ హౌస్ అధికారులు వారి వారి పరిధిలో తుఫాను సంబంధిత సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని పొందడంలో చురుకుగా వ్యవహరించాలని, రోడ్లపై చెట్లు విరిగి పడితే వాటిని తొలగించడానికి తగు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మరీ ముఖ్యంగా జంపన్న వాగు, గుండ్ల వాగు, ప్రధాన చెరువులు, గోదావరి నది పరిసరాలలో నివసిస్తున్న ప్రజలు అప్రమతంగా ఉండాలని, భారీ వర్షపాతం నమోదైతే వెంటనే దగ్గరలోని ఎత్తైన సురక్షిత ప్రదేశానికి చేరుకోవాలని, ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

## పాగాల సంపత్ రెడ్డికి ఇందిర నివాళి



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** మండల పరిధిలోని రాజవరం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్ పర్సన్ పాగాల సంపత్ రెడ్డి మరణించగా మంగళవారం వారి పార్థివ దేహానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి స్టేషన్ ఘనపూర్ ఇంచార్జి సింగపురం ఇందిర పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బాధిత కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది.

## రేవంత్ రెడ్డిని సీఎం చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేవంత్ రెడ్డినే సీఎం చేయాలని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి తెలుగుదేశం కార్యకర్తలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ వాణిజ్య సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెలగందుల రవీందర్ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గాన్ని కోరారు. తెలంగాణలో అడ్రస్ లేని కాంగ్రెస్ పార్టీని డబ్బులకు, కాంట్రాక్టులకు లొంగిపోయి వేరే పార్టీలకు జంపు చేసిన సీనియర్ నాయకులు ఎవరు వచ్చినా దీన్ని బతికించలేరన్న పరిస్థితిలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడి పదవీని రేవంత్ రెడ్డి తీసుకున్నారని తెలిపారు. తన పాదయాత్రతో నేడు తెలంగాణలో కాంగ్రెస్ ని ఒంటిచేత అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రాగానే కొన్ని గుంట నక్కలు, నీ కష్టమే వాళ్ల గొప్పగా చెప్పుకుంటూ సీఎం పదవీకి మేము అర్హులం అంటూ ఫస్ట్ నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నామని కొంతమంది వస్తారని, వాళ్లను తొక్కుకుంటూ పోయి ఆ సింహాసనం మీద కూర్చోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని వెలగందుల రవీందర్ గుప్తా పేర్కొన్నారు.

## సొంత గూటికి మహమ్మద్ అలీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ అలీ మంగళవారం హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అజీజ్ ఖాన్ ఆధ్వర్యంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహమ్మద్ అలీ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురిచేసి మభ్య పెట్టి బెదిరింపులకు పాల్పడితే బీఆర్ఎస్ పార్టీలో చేరానని, నా ఇష్టం లేదన్నారు. తిరిగి నన్ను పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బొమ్మకంట చంద్రమౌళి, బొచ్చు మోహన్, దావు పరమేశ్వర్, వీర్ల చిన్ని, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** అకాల వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, ఈ ఈ, వెంకటేశ్వర్లు, డీఈ రఘువీర్, ఏఈ ప్రమోద్ మంగళవారం వెల్లారు కొండాయి వంతెన ను పరిశీలించారు. వర్షం ఇటు వైపున మామూలుగానే ఉందని, కొండాయి, దొడ్ల ప్రజలను అప్రమత్తం చేసి స్థానిక సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు, గ్రామస్తులకు తెలిపారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణమై ఊరట్టం మీదుగా మేడారం నుంచి తాడ్వాయి చేరుకొని ఏజెన్సీ గ్రామాలను అప్రమత్తం చేశారు. రాగల 24 గంటలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

# ట్రేడ్ వసూళ్లలో పురోగతి సాధించాలి

## బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ట్రేడ్ వసూళ్లలో పురోగతి సాధించాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో పారిశుద్ధ్య అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో సమర్థవంతంగా నిర్వహించుటకు కమిషనర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రేడ్ వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి ముందుకెళ్లాలని, బల్దియా వ్యాప్తంగా 31482 ట్రేడ్ ల రూ. 9కోట్ల 60లక్షలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ. 2కోట్ల 50లక్షల వసూళ్లు మాత్రమే జరిపారని, అత్యధికంగా బకాయిలు ఉన్న ట్రేడ్ ల వసూళ్లు లక్ష్యంగా వసూళ్లు జరిపేలా రూట్ మ్యాప్ సిద్దం చేసి వసూళ్లు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో తాను కుడా ఆకస్మికంగా పర్యటించి ట్రేడ్ వసూళ్ల తీరును పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ట్రేడ్ చెల్లించక పోతే మునిసిపల్ చట్టం సెక్షన్ 264 ప్రకారం షాప్ ను సీజ్ చేసే అధికారం ఉంటుందని, సెక్షన్ 269 ప్రకారం 6 నెలల వరకు జైలు శిక్ష కూడా విధించవచ్చునన్నారు. ఈ నెల 20 వరకు సుమారు 14రోజుల పాటు నగర పరిధిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టి రోడ్ల శుభ్రత, డ్రైనేజీ లలో పేరుకుపోయిన చెత్త తొలగింపు జరగాలని, సంబంధించి డివిజన్ లోని స్థానిక కార్పొరేటర్ ల సమన్వయంతో నిర్వహించాలని, జీపీఎస్ అమర్చిన వాహనాలు, వాహనాల మరమ్మత్తుల సమాచారం అందజేయాలని తెలిపారు. దోమలను అరికట్టడానికి డివిజన్లలో ఫాగింగ్ సక్రమం గా జరిగేలా హెల్త్ అసిస్టెంట్ లతో రివ్యూ నిర్వహించి సమర్థవంతంగా జరిగేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ముఖ్య ఆరోగ్యాధికారి డా. రాజేష్, ఉప కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, సానిటరీ సూపర్ వైజర్లు, ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ చైర్మన్ నవీన్ రాజీనామా



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మానుకోట జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తక్కువ సీట్లు సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదవికి రాజీనామా చేశారు. ఇంతే కాకుండా ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఓడిపోవడంతో నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు నవీన్ రావు ప్రకటించారు. కాగా రెడ్యానాయక్ మంత్రిగా ఉన్న నాటి నుంచి రెడ్యానాయక్ రాజకీయాల్లో పాలు పంచుకుంటూ వెన్నంటే ఉన్న నవీన్ రావు పదవీ రాజీనామా చేయడం ఈ ప్రాంతంలో సంచలనంగా మారింది.

# ఆరోగ్య పరిరక్షణలో ఆశాల సేవలు గొప్పవి

## డీఎంహెచ్ఓ డాక్టర్ అంబరీష్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఆశా డే పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అంబరీష్ ముఖ్య అతిథిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లైన కురవి, మల్యాల,కేసముద్రంలో నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఆశ అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్, వ్యాధులను ముందస్తు గుర్తించి, చికిత్స అందించాలన్నారు. అదేవిధంగా 30సంవత్సరాల పైబడిన వారందరినీ స్క్రీనింగ్ చేయాలని చెప్పారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గునియా, ఫైలేరియా వ్యాధులు రాకుండా ప్రతి మంగళవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరికి సూచించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీల నమోదు 12వారాల్లో చేయించాలని, మొదటి రెండు పరీక్షలు వైద్యాధికారితోను, మూడు, నాలుగు పరీక్షలు ఏరియా హాస్పిటల్ లో డాక్టర్లతో పరీక్ష చేయించాలని, ఏరియా హాస్పిటల్ లో స్త్రీ వైద్య నిపుణులు ఉంటారని, అవసరమైతే స్కానింగ్ కూడా పరీక్ష చేయబడునని, సాధారణ ప్రసవాలు అన్నీ కూడా పీహెచ్ సీలలో చేయాలని, ఆశా కార్యకర్తలు, పిల్లలందరికీ టీకాలు వేయించాలన్నారు. రెండు వారాల మించి దగ్గు ఉంటే తెమడ పరీక్ష చేయించాలని పేర్కొన్నారు. అవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సంప్రదించాలని, వీటిపై ఆశాలందరూ ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ విరాజిత, డాక్టర్ అంబి కిషోర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ క్రిష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, డీపీఎంఓ రుక్ముద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ కేవీ రాజు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కూనంనేనికి సీపీఐ నాయకుల అభినందనలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కొత్తగూడెం నుంచి సీపీఐ ఎమ్మెల్యే గా ఘన విజయం సాధించిన రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కూనమనేని సాంబశివరావు ను మంగళవారం హైదరాబాద్ లో జిల్లా సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మక్దూం భవన్ లో కూనంనేని సాంబశివరావును కలిసి శాలువా, పూల బొకేతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల యూత్ అధ్యక్షుడు బోనగిరి యాకస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, పీసీసీ సభ్యులు లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో గ్రామ మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మామిడాల యశస్విని గెలుపు కోసం పనిచేసిన నాయకులకు కార్యకర్తలను సన్మానించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని, ప్రతి గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలు అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలను, ఓటర్లను ప్రతి ఒక్కరిని కాపాడుకుంటామన్నారు. గత పది సంవత్సరాలుగా అధికారం ఉన్న లేకున్నా నాయకులు ఓటర్లు కాంగ్రెస్ పక్షాన నిలబడి బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఒత్తిళ్లను, బెదిరింపులను, అక్రమ కేసులను తట్టుకొని పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాసరపు ధర్మారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఉప్పల సురేష్ బాబు, ఓడపల్లి రవిందర్,బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాడబోయిన గణేష్ , ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల, సీతారాంపురం సర్పంచి రెడ్డిరాల రమేష్, జిల్లా విద్యావేత్త ఫోరం అధ్యక్షుడు తోటకూరి పాండు కృష్ణ నాగరాజు, పాలకుర్తి బ్లాక్ అధ్యక్షురాలు వడ్లకొండ తార, మండల మహిళా అధ్యక్షురాలు భాగాల మాలతి, మాదాపురం ఉప సర్పంచ్ పంజాల శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసచారి, యూత్ నాయకులు నరేందర్, గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆకాశ దీపోత్సవం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని ప్రసిద్ధిగాంచిన రంగనాథ స్వామి దేవాలయంలో కార్తీకమాస ప్రతిరోజూ భక్తుల సమక్షంలో శివకేశవులకు ఎంతో ప్రీతికరమైన మాసంగా భావించి ఆకాశ దీపాన్ని కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆకాశదీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

# మౌచింగ్ తుఫాన్ ఇబ్బందుల్లో రైతులు

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మౌచింగ్ తుఫాను గత రెండు రోజులుగా ఆత్మకూర్ మండలంలో భారీ వర్షం కురుస్తుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. చేతికి అందిన పంటకు ఈ వర్షాలతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పత్తి వేరే టైంలో ఈ తుఫాను వర్షం పడడంతో పత్తి ముద్దగా మారి భారీ నష్టం వాటిల్లుతుందని రైతులు తెలిపారు. అదే విధంగా వరి పంట కోయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ తుఫాను ఇదే విధంగా ఉంటే రైతులు మరింత నష్టపోతారన్నారు. ఆరుకాలం కష్టపడి పంట చేతికి అందే సమయంలో ఇలాంటి తుఫానుల వల్ల వరి పంట కిందపడి మొలకలు రావడంతో పంట నష్టపోయి రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

## వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు నన్ను ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటు వేసి నియోజకవర్గ శాసనసభ్యుడిగా నన్ను గెలిపించినందుకు మీకు రుణపడి ఉంటానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పేర్కొన్నారు. నా గెలుపుకోసం, పార్టీకోసం పనిచేసిన ప్రతి ఒక్కరికినాయిని రాజేందర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అతిత్వరలో నియోజకవర్గంలో ప్రతి ఒక ఓటరును కలిసి కృతజ్ఞతలు తెలియ చేస్తానని అన్నారు.

# ఘనంగా ఏవీవీ వార్షికోత్సవ వేడుకలు

## ఇంటర్ విద్య డీఐఈఓ మాధవరావు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఏవీవీ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ప్రారంభమయ్యాయి. సాయంకాలం జరిగిన కార్యక్రమంలో ఇంటర్ విద్య డీఐఈఓ కే.మాధవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంత చక్కటి కాలేజీలో చదువుకోవడం మీ అదృష్టమని విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థలతో పోటీ పడుతూ మంచి ఫలితాలు సాధిస్తున్న కళాశాలలో ఏవీవీ ప్రథమ స్థానంలో ఉందన్నారు. మీరంతా చక్కటి విద్యలు అభ్యసించి ఉన్నత స్థానాల్లో నిలిచి సమాజానికి సేవ చేయాలన్నారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయకుమార్, కళాశాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్ని విధాల సహాయం చేయడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. సభా అధ్యక్షత వహిస్తూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ భుజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో చదువుతున్న విద్యార్థులు కనబరిచిన ప్రతిభను వివరిస్తూ చదువుతో పాటుగా సామాజిక జ్ఞానాన్ని నేటి విద్యార్థికి ఉండవలసిన క్రమశిక్షణను వివరిస్తూ విద్యార్థులకు చక్కటి బోధను అందజేస్తున్న అధ్యాపకులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు పుర ప్రముఖులు, అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల వార్షికోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన సాహిత్య క్రీడా బహుమతులను అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. తదుపరి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.

# రేవంత్ రెడ్డినే సీఎం చేయాలి

## కేయూ పరిశోధక విద్యార్థుల డిమాండ్



**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 65సీట్లు రావడం వెనకాల రేవంత్ రెడ్డి కృషి చాలా ఉందని, కాబట్టి రేవంత్ రెడ్డినే ముఖ్యమంత్రిగా చేయాలని మంగళవారం కాకతీయ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు కుర్స అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేష్ ఆధ్వర్యంలో కేయూ పరిశోధకుల హాస్టల్ లో విద్యార్థులు కలిసి డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుగులోతు రమేష్ నాయక్, మాదశి రమేష్ , డా.కిషోర్, గోపాల్ దాస్, సంపత్, భూక్యా హుస్సేన్ నాయక్, వెంకట్ రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయండి

## నగర మేయర్ గుండు సుధారాణి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం బల్దియా పరిధిలోని 34వ డివిజన్ శివనగర్ లోని పల్లవి హాస్పిటల్ వద్ద కొనసాగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను మేయర్ పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థానికంగా ఏర్పడ్డ డ్రైన్ నిర్మాణ సమస్యను పరిష్కరించడానికి పట్టణ ప్రణాళిక విభాగ అధికారుల సమన్వయంతో పరిష్కరించి అట్టి పనులు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. మిచ్ గాం తుఫాను ప్రభావంతో వాతావరణ శాఖ నగరానికి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షం కురిస్తే నీరు సులువుగా వెళ్లడానికి వీలుగా డ్రైనేజీలను ఎప్పటికపుడు శుభ్రంగా ఉండేలా చెత్త తొలగించేలా చూడాలని ముఖ్య ఆరోగ్య అధికారిని మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమార స్వామి, సీఎంహెచ్ఓ డా.రాజేష్, ఈఈ శ్రీనివాస్, శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, శానిటరీ ఇన్ స్పెక్టర్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ చిహ్నాలు పరిశీలించిన కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా




వరంగల్ వాయిస్, వరంగల్ : స్మార్ట్ సిటీ కి చెందిన చిహ్నాలు(ఎంబ్లమ్స్)ను బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మంగళవారం ప్రధాన కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ అఫ్హైర్స్ వారి ఆదేశాల మేరకు స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ సంబంధ అభివృద్ధి పనులు పూర్తయిన, కొనసాగుతున్న ప్రాంతాల్లో చిహ్నాలు (ఎంబ్లమ్స్)ను ఏర్పాటు చేయాలని సూచించడం జరిగింది. ఈ నేపథ్యంలో బల్దియా పరిధిలోని రోడ్లు, ఫూట్ పాత్ లలో సుమారు 500ప్రాంతాల్లో వీటిని ప్రదర్శించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ సంజయ్ కుమార్, డీఈ రవికుమార్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

# తదుపరి ఐటీ మినిస్టర్ ఎవరు?

## సోషల్ మీడియా వేదికగా చర్చ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి ఎవరన్న చర్చ ఇప్పుడు మొదలయ్యింది. సీఎం ఎవరన్న చర్చతో పాటు ఇది కూడా ముందుకు వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం కైవసం చేసుకున్న తర్వాత అందరూ దీని గురించే చర్చిస్తున్నారు. దీంతో పాటు మరో అంశం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణకు ఐటీ మినిస్టర్ ఎవరు కాబోతున్నారనే దానిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఐటీ రంగం అభివృద్ధి కోసం కేటీఆర్ చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ నెటిజన్లు పెద్ద ఎత్తున ట్వీట్లు చేస్తున్నారు. తర్వాత ముఖ్యమంత్రి ఎవరు అవుతారనేది కాదు.. కేటీఆర్‌కు సరిపోయే ఐటీ మినిస్టర్‌ను కాంగ్రెస్ తీసుకురాగలదా? అని చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు మేం చూసిన బెస్ట్ ఐటీ మినిస్టర్ మీరే' 'తెలంగాణ బెస్ట్ ఐటీ మినిస్టర్‌ను కోల్పోయింది'. అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి కామెంట్లు పెడుతున్నారు. ఇకపై కేటీఆర్ ఐటీ మినిస్టర్ కాదని తెలిసి నా ఐటీ జాబ్‌కు రాజీనామా చేస్తున్నామని కొంతమంది ట్వీట్లు చేశారు. ఐటీ మినిస్టర్ అనే పదానికి కేటీఆర్ రోల్ మాడల్ అని.. విజినరీ నాయకత్వాన్ని మిస్సవుతున్నామని కామెంట్లు పెడుతున్నారు. హైదరాబాద్ ఇంతగా అభివృద్ధి చెందింది.. ఉద్యోగవకాశాలతో లక్షలాది మంది ఇక్కడ జీవిస్తున్నారంటే దానికి కారణం మీరేనంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్‌ను ట్రెండ్ సెట్టర్ అంటూ కొనియాడుతున్నారు. గతంలో ఐటీశాఖ మంత్రిగా దుద్దిళ్ల శ్రీధర్ బాబు పనిచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ కేబినేట్ రేసులో ఆయన కూడా ఉన్నారు. అయితే తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేల్లో చాలామంది విద్యావంతులు ఉన్నారు. ఇందులో ఓ మంచి సమర్థుడిని ఎంచుకుంటే మంచిదన్న అబిప్రాయం కూడా వస్తోంది.

# తెలంగాణకు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి

## కాంగ్రెస్ విజయంలో రేవంత్ కీలక భూమిక

## ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. సీఎం పదవికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది. తెలంగాణ ఏర్పడ్డ తరవాత తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ దాదాపు పదేళ్లు పాలించారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో మలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేయబోతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయబోతున్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో పార్టీ అగ్రనేతలతో జరిగిన భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పరిణామాలు, సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు చెప్పిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం రేవంత్‌ను సీఎల్పీ నేతగా ఎంపిక చేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ దిల్లీలో ప్రకటించారు. డిసెంబర్ 7న ఆయన ప్రమాణస్వీకారం చేస్తారని కూడా చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెల్లడ్కెనప్పటి నుంచి తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని జోరుగా ప్రచారం



జరిగినప్పటికీ, కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో ఇప్పటివరకు ప్రతిష్టంభన కొనసాగుతూ వచ్చింది. గచ్చిబౌలిలోని ఎల్లా హెూటల్‌లో సమావేశమైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా సీఎల్పీ ఎంపిక నిర్ణయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు అప్పగిస్తూ సోమవారం ఏక వాక్య తీర్మానం చేశారు. దీన్ని భట్టి విక్రమార్క, సీతక్కతోపాటు పలువురు ఎమ్మెల్యేలు బలపరిచారు. సీఎల్పీ తీర్మానాన్ని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధిష్ఠానానికి చేరవేశారు. దీనిపై మంగళవారం సుదీర్ఘంగా చర్చించిన అగ్రనేతలు రేవంత్‌ను సీఎంగా ఎంపిక చేశారు.

# యశస్విని గెలుపుతో మోకాళ్లపై మొక్కులు

**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** ఎమ్మెల్యేగా యశస్విని రెడ్డి గెలిచిన సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన పార్టీ కార్యకర్త జూకంటి బీరన్న స్థానిక శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. సోమవారం మోకాళ్లపై ఆలయ మెట్టెక్కి మొక్కులు తీర్చుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తిలో కాంగ్రెస్ గెలిచినందుకు మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈరవెన్ను గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు మెట్టుకో కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించారు. ఈసందర్భంగా సోమేశ్వర్ మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఇదే మొదటిసారి అన్నారు. యశస్వినిరెడ్డిని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# హృతిక్ రోషన్ లుక్ అదుర్స్





హృతిక్ రోషన్ తాజాగా నటిస్తున్న చిత్రం ఫైటర్ .. వన్ ఆఫ్ ది మోస్ట్ అవైటెడ్ సినిమాగా ఎన్నో అంచనాలు ఉన్న ఈ సినిమా కోసం దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఎదురు చూస్తున్నారు. సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్, దీపికా పదుకొనే ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా వయాకామ్ 18 స్టూడియోస్-మార్ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్త నిర్మిస్తుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి హృతిక్ లుక్‌ను, క్యారెక్టర్ డిటెయిల్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. హాలీవుడ్ చిత్రం టాప్ గన్ తరహాలో మన దేశం నుంచి మొట్టమొదటి సారిగా ఎవియేషన్ జానర్‌లో రూపొందుతున్న ఈసినిమాలో ఆయన ఎయిర్ డ్రాగన్స్ విభాగంలో స్క్వాడ్రన్ లీడర్ షంషేర్ పఠానియా (పాటీ)గా అనే స్క్వాడ్రన్ పైలట్ పాత్రలో కనిపించబోతున్నాడు.

# నేనలా మాట్లాడలేదు



జాతీయ పురస్కార గ్రహీత కృతి సనన్ ట్రేడింగ్ మాధ్యమాలను సపోర్ట్ చేస్తున్నారంటూ ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే! బాలీవుడ్ టాక్‌షో కాఫీ విత కరణ్‌లో ఆమె ట్రేడింగ్ మాధ్యమాలను ప్రోత్సహించారని పలు కథనాలు వచ్చాయి. దీనిపై వివరణ ఇస్తూ కృతి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'కొన్ని మీడియా సంస్థలు నేను మాట్లాడని వాటిని ప్రచారం చేశాయి. ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లతో నాకు అనుబంధం ఉందని రాశారు. అవన్నీ పూర్తిగా అవాస్తవం. నేను ఈ అంశంపై ఎప్పుడూ మాట్లాడలేదు. ఇలాంటి తప్పుడు కథనాలు, నివేదికలపై నేను చట్టపరమైన చర్యలు తీసుకున్నాను. లీగల్ నోటీసులు జారీ చేశాను. ఇలాంటి తప్పుడు రిపోర్టుల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ ఇనస్టా స్టోరీలో పోస్ట్ చేశారు. మిమి చిత్రం తన నటనకుగానూ ఉత్తమ నటిగా ఈ ఏడాది జాతీయ అవార్డును అందుకున్న కృతిసనన. ఇటీవల 'గణపథ్: ఎ హీరో ఈజ్ బోర్న్'తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో మూడు సినిమాల్లో నటిస్తున్నారు. అలాగే 'దో పత్తి' అనే చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# సుధీర్ బాబు.. సరికొత్తగా

మామామశ్చీంద్ర తర్వాత సుధీర్ బాబు నటిస్తున్న చిత్రం 'హరోం హర'. పాన్ ఇండియాగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ఇటీవల విడుదల అవగా ప్రేక్షకుల నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. 7 రోజుల్లోనే 10 మిలియన్ వ్యూస్ సాధించి యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచి సుధీర్‌బాబు ఈసారి తప్పనిసరిగా భారీ హిట్ కొడుతాడనే నమ్మకాన్ని ఇచ్చింది. ఈక్రమంలో టీజర్ సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించి మీడియాతో చిట్‌చాట్ చేశారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ నాయుడు నిర్మిస్తున్న ఈ సినిమాను గతంలో 'సెహరి' అనే చిత్రాన్ని డైరెక్ట్ చేసిన జ్ఞానసాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. 'రెడ్, నేల టికెట్టు' సినిమాల్లో కథానాయికగా చేసిన మాళవిక శర్మ ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్నది. ఈ సందర్భంగా మీడియాతో సుధీర్‌బాబు మాట్లాడుతూ 'బడ్జెట్ విషయంలో ఎక్కడా తగ్గకుండా నిర్మాతలు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని, డైరెక్టర్ నన్ను సరికొత్తగా ప్రజెంట్ చేశాడని, నా నట విశ్వరూపం చూస్తారని అన్నారు.





## యష్ అభిమానులకు
# గుడ్‌న్యూస్

'కేజీఎఫ్' సిరీస్ చిత్రాలతో దేశవ్యాప్తంగా తిరుగులేని స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారు కన్నడ హీరో యష్. 'కేజీఎఫ్-2' తర్వాత ఆయన తదుపరి సినిమా కోసం దేశవ్యాప్తంగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యష్ చేయబోయే సినిమా ఎలా ఉంటుందోనని అందరిలో ఆసక్తి పెరిగింది. 'యష్-19' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా అప్‌డేట్‌ను అందించారు యష్. డిసెంబర్ 8న ఈ సినిమా టైటిల్ ప్రకటన ఉంటుందని తెలిపారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన దర్శకుడి వివరాలను యష్ వెల్లడించనప్పటికీ.. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వ బాధ్యతలను తీసుకోనున్నారని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమా లొకేషన్ సెర్చ్ కోసం యష్ శ్రీలంకలో పర్యటిస్తున్నట్లు సమాచారం.

# సీఎంగా రేవంత్ రెడ్డి

**సీఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక**

**7న ప్రమాణ స్వీకారం**

**ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు వేణుగోపాల్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సీఎల్పీ నేతగా అనుముల రేవంత్ రెడ్డిని ఏకగ్రీవంగా నియమించినట్లు ఆ పార్టీ పరిశీలకులు కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. దీంతో తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా ఈనెల 7న రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఈ మేరకు అధిష్ఠానం నిర్ణయాన్ని కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోని సీనియర్లందరికీ తగిన న్యాయం జరుగుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో వ్యక్తిగత నిర్ణయాలు ఉండవని, అంతా టీమ్ వర్క్ గా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యేల

### హైడ్రామా..

రాష్ట్రంలో 48 గంటలుగా హైడ్రామా కొనసాగింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజారిటీ వచ్చినప్పటికీ ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో సందిగ్ధం నెలకొంది. ముఖ్యమంత్రి ఎంపిక బాధ్యతను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి అప్పగిస్తూ ఏకగ్రీవంగా తీర్మాణం చేయడంతో సీన్ మొత్తం ఢిల్లీకి మారింది. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్కలు కూడా ముఖ్యమంత్రి పదవికి తమ పేర్లను కూడా పనిగణలోకి తీసుకోవాలంటూ అభ్యర్థించడంతో సమస్య తిరిగి మొదటికొచ్చింది. ఢిల్లీలో ఎవరికి వారు తమకే సీఎం పదవి కేటాయించాలంటూ మంతనాలు చేయడంతో అయోమయ పరిస్థితి నెలకొంది.

### ఢిల్లీకి రేవంత్ రెడ్డి..

ఢిల్లీలోని కేసీ వేణుగోపాల్ నివాసంలో మంగళవారం సాయంత్రం కీలక భేటీ జరిగింది. ఈ భేటీలో డీకే శివకుమార్, థాక్రేతోపాటు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఇదే సమయంలో రేవంత్ రెడ్డిని ఢిల్లీకి రావాలంటూ అధిష్ఠానం పిలుపు ఇవ్వడంతో ఆయన బయలు దేరారు. ఆయన విమానంలో ఉన్నప్పుడే సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డిని ప్రకటిస్తూ కేసీ వేణుగోపాల్ ప్రకటన చేశారు. దీంతో గత రెండు రోజులుగా జరిగిన హైడ్రామాకు తెరపడింది.



# ఘనంగా సామూహిక అనగాష్టమి వ్రతాలు

**దత్త పీఠంలో ఏర్పాట్లు**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** దత్త పీఠం ఉత్తరాదికారి సద్గురు శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ అశీసులతో మంగళవారం ములుగు రోడ్ లోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో ఉదయం 10 గంటలకు సామూహిక శ్రీ అనగాష్టమి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ గణపతి సచ్చిదానంద దత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వ్రతాలను ఆచరించారు. అనంతరం దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

# పాగాల సంపత్‌కు కేటీఆర్ నివాళి

**ఆయన మరణం పార్టీకి తీరని లోటని వ్యాఖ్య**

**కుటుంబ సభ్యులకు అండగా ఉంటామంటూ హామీ**



**వరంగల్ వాయిస్, జనగామ :** బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి (55) పార్థివ దేహానికి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సంపత్‌రెడ్డి అకాల మరణం కలిచివేసిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. సోమవారం సాయంత్రం హనుమకొండలోని తన నివాసంలో గుండెపోటు రావడంతో సంపత్‌రెడ్డి కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడిగా బీఆర్ఎస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎంపి పసునూరి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, గండ్ర వెంకట రమణారెడ్డి, తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తదితరులున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సంపత్ రెడ్డి మృతికి నివాళి అర్పించారు.





# రాష్ట్ర స్థాయి పోటీలకు.. గొర్రెకుంట విద్యార్థులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తొర్రూర్ పట్టణంలో జరుగనున్న రాష్ట్రస్థాయి బేస్ బాల్ పాఠశాలల క్రీడలకు గొర్రెకుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 4వ తేదీన మహబూబాబాద్ పట్టణంలోని ఎన్.టి.ఆర్. క్రీడా ప్రాంగణంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బేస్ బాల్ పాఠశాలల ఎంపిక క్రీడా పోటీలలో గీసుకొండ మండలం 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎల్.అన్షు, ఎన్.అభినందన్, ఎల్.రిషి తమ ప్రతిభను చాటారు. దీంతో ఈ నెల 8,9,10 తేదీల్లో తొర్రూర్ పట్టణంలో అండర్ 14 రాష్ట్రస్థాయి బేస్ బాల్ పాఠశాలల క్రీడలకు వీరు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నలిమెల జ్యోతిర్మయి, పీఈటీ జలగం రఘువీర్ తెలిపారు. తమ క్రీడా ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఎల్.అన్షు, ఎన్.అభినందన్, ఎల్.రిషిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.జ్యోతిర్మయి, స్థానిక కార్పొరేటర్ ఆకుల మనోహర్, విద్యాకమిటి ఛైర్మన్ జున్ను కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయ బృందం షహీన్ సుల్తాన, ఎం.చంద్రశేఖర్, మార్త శ్రీనివాస్, సీహెచ్.అనిత, పి.ప్రణతికుమారి, ఎం.ప్రభాకర్, జె.దమరి, ఆర్.రాజు, సీహెచ్.శ్రీదేవి, పీఈటీ జె.రఘువీర్, గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

# జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు 2023 డిసెంబర్ 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ మాచవరం గౌరీ శంకర్ ఒక ప్రకటనలో కోరారు. కవులు, రచయితలు, విద్య, వైద్యం, చెక్కభజన, హరికథ, బుర్రకథ, కూచిపూడి, భరతనాట్యం, కథక్, నృత్యం, చిత్రలేఖనం, నాటకం, సామాజిక సేవ, జానపదం, మిమిక్రీ, ఆర్టిస్టు, షార్ట్ ఫిలిం, జ్యోతిష్యం, వాస్తు, అవధానం, భజన, సంగీతం, సినిమా రంగం, కోలాటం, టైలరింగ్, ఆయుర్వేదం, ఇంద్రజాలం, యోగ, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, గ్రామీణ అభివృద్ధి, శిల్పం, క్రీడారంగం, డోలక్, హార్మోనియం, తబలా, ప్రజాప్రతినిధులు, వంటి వాటిలో ప్రావీణ్యం పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పురస్కారాలు హైదరాబాదులో జరుగుతాయని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం ఈ 99852 75385, 73825 92852 సెల్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com